# పంచనదుల ప్రాశస్త్యం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

ప్రవచనం

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | గంగానది | 7 |
| 2. | యమునానది | 76 |
| 3. | నర్మదానది | 118 |
| 4. | గోదావరీనది | 152 |
| 5. | కృష్ణానది | 194 |

# గంగానది

**మ**నకి సనాతనధర్మంలో నదులు అత్యంతప్రముఖమైన విశేషాన్ని పొంది ఉంటాయి. మనమేదైనా పూజ చేయాలన్నా కూడా, మొదటగా కలశారాధనమని నదులని నీటిలోకి ఆవాహన చేస్తాం.

**గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతీ ।**
**నర్మదే సింధు కావేర్యో జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥**

అని ఆ నీటిని యజమాని మీదా, పూజాద్రవ్యాల మీదా ప్రోక్షించుకుని, ఎదురుగా ఉన్న ఆరాధన చేయవలసిన పరమేశ్వరమూర్తి మీద కూడా ప్రోక్షించి, ఆ తరవాత పూజాకార్యక్రమాన్ని ప్రారంభం చేస్తాం. సనాతనధర్మంలో నదికి ఉన్నంత గౌరవం, నదికి ఉండే పూజ, నదికి ఉండే వైశిష్ట్యం చాలా విశేషంగా ఉంటాయి. నదిని కేవలం ఒక నీటి ప్రవాహంగా చూడడం ఉండదు. ప్రతి నదికీ ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. అది కేవలం నీటినుండి ఉత్పన్నమైన శక్తి కాదు. ఒక్కొక్క నదికి ఉన్న అధిష్ఠానదేవతా ప్రజలను ఒక్కొక్క రకంగా అనుగ్రహిస్తూ ఉంటుంది. అందువల్లనే ఎక్కడెక్కడ నదులు ఉన్నాయో అక్కడక్కడ విశేషమైన పూజ జరుగుతుంటుంది. మనం గమనిస్తే ఇది ఇవ్వాళా, నిన్నా వచ్చిన ఆచారం కాదు. త్రేతాయుగంలో రామచంద్రమూర్తీ, సీతమ్మా నదులను దాటవలసి వస్తే ప్రత్యేకంగా ఎలా ఆరాధన చేశారో, ఒక నదిని దాటి వెళ్లిన తరవాత క్షేమంగా మళ్లీ తిరిగి ఆవలి వొడ్డుకి చేరుకున్నప్పుడు, ఆ నదికి ప్రత్యేకంగా పూజ చేస్తానని, నివేదనలు సమర్పిస్తానని సీతమ్మ మొక్కుకున్న తీరు గమనిస్తే, నదులకు ఉన్న అధిష్ఠానదేవతలు ప్రార్థన చేసిన భక్తులను అనుగ్రహించకలిగినవారై ఉంటారని అనేకసందర్భాలలో ప్రత్యక్షమైన స్థితి. అలాగే భాగవతోత్తములైనవారు నదీస్నానానికి వెళ్లినప్పుడు, ఆ నది అధిష్ఠానదేవత వారితో మాట్లాడి, వారి నుండి

ఏదో బహుమానాన్ని తాను కోరుకుని స్వీకరించి, సంతోషించిన సందర్భాలు కోకొల్లలు.

నదులు, నదాలు అని రెండు మాటలు. పశ్చిమం నుంచి తూర్పుగా ప్రవహించి తూర్పున ఉన్న సముద్రంలో కలిస్తే దాన్ని నది అని పిలుస్తారు. పశ్చిమాభిముఖంగా ప్రయాణం చేసి పశ్చిమాన ఉన్న సముద్రంలో కలసిపోతే నదం అని పిలుస్తారు. మనందరికీ వేదం ప్రమాణవాక్కు. అంటే వేదం ఏం చెప్పిందో దాన్ని ఆధారం చేసుకుని మన జీవితాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తాం. మనకి ఐదే ప్రమాణాలు.

మొదటిది శ్రుతి, రెండవది స్మృతి, మూడవది పురాణం, నాలుగవది శిష్టాచారం, ఐదవది అంతరాత్మ. ఇందులో కింది నాలుగూ కూడా ఎప్పుడూ వేదంతో విభేదించవు. వేదం ఈశ్వరుని ఊపిరి, అపౌరుషేయం. మనుష్యులెవరి చేతా రచించబడినది కాదు. పరమేశ్వరుడు ఎంత అనాదో వేదం కూడా అంతే అనాది. అటువంటి వేదమంత్రాలు సమాధిలో ఉన్న ఋషులకు వినపడ్డాయి. వారా మంత్రాలను తమ శిష్యులకు స్వరప్రోక్తంగా అప్పచెప్పారు. వేదానికీ, వేదమంత్రాలకూ ప్రాణం స్వరంలో ఉంటుంది. గురువుగారు శిష్యులను కూర్చోపెట్టుకుని ఉదాత్త, అనుదాత్త, స్వరిత స్వరాలతో ఆ మంత్రాన్ని చెపితే, స్వరాలతో పాటుగా మంత్రం పలకడం నేర్చుకుంటారు. భగవంతుని ఊపిరి అయిన వేదమే ప్రమాణం. మనమెలా బ్రతకాలి అన్నది నిశ్చయం చేసి చెప్పగలిగింది వేదమొక్కటే. అటువంటి ప్రమాణవాక్కయిన వేదం, నది అన్న మాటని నిర్వచనం చేసింది. నది అన్న మాట ఎందుకు ఉత్పన్నమయిందో, నదులను ఆ పేరుతో ఎందుకు పిలుస్తారో, నదికి ప్రవాహం అని కొన్ని చోట్ల పేరెందుకు వచ్చిందో చెపుతూ –

**యస్మాత్నాదం కృతవత్యః తస్మాత్ నదీతి నామధేయం ప్రాప్తా –**

ఎక్కడైతే ప్రవాహం తనంత తానుగా ఒక నాదాన్ని – ఒక చప్పుడును – చేస్తుందో – అది ఎటువంటి చప్పుడు అని అడిగారు – దివ్యలోకం నుంచి మొదట ప్రారంభమైన జలప్రవాహం మేఘమండలంలోకి చేరి, వర్షంగా